క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం గ్రామానికి చెందిన పలువురు సోమవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యాన కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరినట్లు ప్రకటించారు. చేరిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ తేజావత్ కళావతి, తేజావత్ సామిత్, లాల్‌కుమార్, చిర్రా రామకృష్ణ, ఆదినారాయణ, తగరం కిరణ్, సాయి, బానోత్ ఉపేందర్, హరీష్, భీమా తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తోలుపునూరి దానయ్య, మార్కెట్ డైరెక్టర్ కుతుంబాక నరేష్, గ్రామ పార్టీ కార్యదర్శి వర్దబోయిన కోదండ రాములు, మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాలోత్ రమేష్, మండల ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు గుగులోతు ప్రవీణ్, సీనియర్ నాయకులు కూరాకుల సత్యం, పరిటాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా అభ్యుదయ పద్మశాలీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొమ్మ రాజేశ్వరావు, వెలిగేటి చంద్రమోహన్, జల్లా లక్ష్మీనారాయణ, ఉదారిపద్మ, విజయశాంత, జె.వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, నాగేశ్వరావు, భిక్షం, రామారావు, రాధాకృష్ణ, తేజ, కొండలు, బుల్లెట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో నెలకొన్న బాలిక అదృశ్య ఘటనపై సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే..మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన ఓ బాలిక ఆదివారం రాత్రి నుంచి కనిపించటం లేదు. కాగా, అదే కాలనీకి చెందిన భగవాన్ అనే యువకుడు తీసుకెళ్లినట్లుగా అనుమానిస్తూ బాలిక తల్లి మంగమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు ఇల్లెందు క్రాస్‌రోడ్డు రైతుబజార్ మార్పు

ఖమ్మంవ్యవసాయం: ఖమం నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఉన్న రైతుబజార్‌ను బుధవారం నగరంలోని వీడీవోస్ కాలనీలోని ఏసీపీ కార్యాలయం వెనుక భాగంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌లోకి మార్చేందుకు నిర్ణయించినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.నాగరాజు తెలిపారు. సోమవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ వీపీ గౌతమ్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి, అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్న సమావేశంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభోత్సవం, రైతు బజార్ తరలింపు వంటి అంశాలను చర్చించినట్లు తెలిపారు. రైతు బజార్‌లో పంటలు విక్రయించే రైతులు, వినియోగదారులు రైతుబజార్ తరలింపు అంశాన్ని గుర్తించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌టీపీ అనుబంధ సంఘాల కమిటీలు


నియామక పత్రాలను అందిస్తున్న సుధీర్‌బాబు

ఖమ్మంరూరల్: వైఎస్సార్ టీపీ ముస్లిం మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా గుర్రాలపాడుకు చెందిన మహ్మద్ ఖాజా సావుద్దీన్, బీసీ సెల్ అధ్యక్షుడిగా గుదిమళ్లకు చెందిన తమ్మిశెట్టి కృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వీరికి సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు నియామక పత్రాలు అందజేశాక మాట్లాడుతూ.. పార్టీ లక్ష్యాలను గడపగడపకు వివరించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎండపల్లి వెంకయ్య, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రైటర్ పద్మభూషణ్
వినోద	మైఖేల్
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	రెబెల్స్ ఆఫ్ తుపాకులగూడెం

- ఖమ్మంవ్యవసాయం

జంక్షన్లు.. జబర్దస్త్!

విశాలమైన శ్రీశ్రీ, ఎన్టీఆర్ సర్కిళ్లు..
- రింగ్ కుదింపుతో తగ్గిన ప్రమాదాలు
- విద్యుత్ కాంతులతో కొత్తశోభ
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు


కొత్తరూపంతో కనపడుతున్న శ్రీశ్రీ సర్కిల్


రింగు కుదింపుతో విశాలంగా మారిన ఎన్టీఆర్ సర్కిల్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే జంక్షన్లకు ఆర్‌అండ్‌బీ అధికారులు రింగు కుదింపునకు శ్రీకారం చుట్టారు. ఇటీవల చేపట్టిన జంక్షన్ కుదింపు పనులతో కొంత మేర ట్రాఫిక్ సమస్య ఏర్పడినప్పటికీ తర్వాత ఊరట లభించింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై ప్రధాన జంక్షన్ల వద్ద సిగ్నల్ పడిన సమయాన ట్రాఫిక్ నిలిచిపోవడం, ఒక్కోసారి రెండు దఫాలు సిగ్నల్ పడే వరకూ వాహనాలు ఆగిపోవాల్సి వచ్చేది. గతంలో నిర్మించిన ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రింగ్ చాలా పెద్దగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో పాటు తరచూ ప్రమాదాలు చోటు చేసుకునేవి.

తగ్గిన ట్రాఫిక్ సమస్యలు..

ఇటీవల ఎన్టీఆర్ సర్కిల్‌ను మరమ్మతులతో పాటు రింగును కుదించి అధికారులు రోడ్డు మార్గాన్ని విశాలంగా మార్చారు. దీంతో భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు సులువు మార్గంగా మారింది. గతంలో ఉన్న దాని కంటే రింగు చుట్టూ 10 నుంచి 12 అడుగుల మేర తగ్గించినట్లు సంబంధిత ఇంజనీరింగ్ అధికారి తెలిపారు. ఇదే తరహాలో శ్రీశ్రీ సర్కిల్‌లో గతంలో ఉన్న పెద్ద రింగును కుదింపు పనులు పూర్తి చేసి రోడ్లకు ఇరువైపుల సెంటర్ డివైడర్లు నిర్మాణం చేసి లైటింగ్ ఏర్పాటు చేసి కొత్త రూపం తీసుకొచ్చారు. గతంలో శ్రీశ్రీ సర్కిల్ ఇరుకుగా రెండు వైపుల కలిసి మూడు లైన్లకు రోడ్డు జంక్షన్‌గా ఉన్న ఈ ప్రాంతంలో ప్రస్తుతం నాలుగు లైన్ల రోడ్లుగా మార్చి డివైడర్ నిర్మాణం చేశారు. గతంలో 30 మీటర్ల మేర ఉన్న రింగు, ప్రస్తుతం కుదింపుతో 10 మీటర్లుగా ఏర్పడి జంక్షన్ విశాలంగా మారింది.

తరచూ ప్రమాదాలు..

గతంలో ఈ రెండు జంక్షన్ల వద్ద అనేక ప్రమాదాలు చోటు చేసుకుని పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాలపాలవడం, కొంతమంది మృత్యువాత పడడం, మరికొంత మందిరికి శరీర భాగాలు కోల్పోవడం వంటి సంఘటనలు జరిగాయి. ఏడాది క్రితం ఇదే జంక్షన్‌లో ఒక సైకిలిస్ట్ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. జంక్షన్లకుదింపుతో ట్రాఫిక్ సమస్యలకు కొంతమేర పరిష్కారం లభించిందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒత్తిడి తగ్గింది..



ఎన్టీఆర్ సర్కిల్‌లో రింగు తగ్గించడం వల్ల ఒత్తిడి తగ్గింది. సిగ్నల్ పడినప్పుడల్లా రెండు, మూడు దఫాలుగా రోడ్డు దాటాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు జంక్షన్లను కుదించడంతో ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా పోయింది.

– తోటా వెంకట్, వాహనదారుడు, కోయచలక

ట్రాఫిక్ సమస్య లేదు..



శ్రీశ్రీ, ఎన్టీఆర్ సర్కిళ్లలోని జంక్షన్లను చాలా వరకు తగ్గించడం వల్ల ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. గతంలో భారీ వాహనాలు వెళ్లేటప్పుడు ఇరుగుగా ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఇప్పుడు ఆ సమస్య లేదు.

– కొర్రా రమేష్ వాహనదారుడు పెద్దతండా

సర్కిల్ తగ్గించి డివైడర్లు నిర్మించాం..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలోని ప్రధాన సర్కిళ్ల కుదింపు చర్యలు చేపట్టాం. శ్రీశ్రీ సర్కిల్‌ను కుదించి రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణం చేపట్టాం. దీంతో వాహనాల రాకపోకలకు సులువైన మార్గం ఏర్పడింది.

– జి.ప్రవీణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ

డీలర్‌పై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

తిరుమలాయపాలెం: నకిలీ మిర్చి విత్తనాలు అంటగట్టిన విత్తన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గిరిజన కౌలు రైతులు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన కౌలు రైతులు గుంటూరులో వెంకటసాయి సీడ్స్ నుంచి లక్ష్మీ హాట్, జమున హైబ్రిడ్ సన్నరకం మిర్చి విత్తనాలను కొనుగోలు చేసి ఎనిమిది ఎకరాల్లో మిర్చి సాగుచేసినట్లు కలెక్టర్‌కు విన్నవించారు. కాపుకి వచ్చే సమయానికి కాపు రాలేదని, కొన్ని చెట్లు కాపు వచ్చినా లావు కాయలు వచ్చాయని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా మిర్చి విత్తనాలు సన్నరకం కాదని లావురకం అని ధ్రువీకరించినట్లు విన్నవించారు. నకిలీ విత్తనాలను అంటగట్టిన విత్తన డీలర్‌పై చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతులు ధరావత్ రవీంద్ర, బాలు, పంతులు, భీమ్లా, ధన్‌సింగ్, రైతు సంఘం మండల కార్యదర్శి బింగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతు సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి..

ఫిబ్రవరి 15న నిర్వహించే గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతి పత్రం అందజేశారు. అంతేకాక ట్రైకార్ రుణాలను వెంటనే విడుదల చేయాలని ట్రైబల్ డిపార్ట్‌మెంట్ డీడీ కృష్ణనాయక్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ సురేష్, అశోక్, రమేష్, నాగ, శంకర్, నరేష్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు విశేష స్పందన


కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

నేలకొండపల్లి: ఆరోగ్యవంతమైన సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రాపురంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రానికి వచ్చిన ప్రతీ ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందిస్తున్నందున అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి శివ, సర్పంచ్ లంకెల శ్యామల, వైద్యాధికారి గీత, కంటి వెలుగు అధికారి డాక్టర్ రాధాకృష్ణ, పీహెచ్ఎస్ కె.వాణి, అంగన్‌వాడీలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రలో 'మద్ది'

ఖమ్మంరూరల్: ములుగు జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రారంభించిన జోడో పాదయాత్రలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పస్రా సమీపంలోని ప్రాజెక్ట్‌నగర్ వద్ద పాదయాత్ర సందర్భంగా రేవంత్‌రెడ్డిని కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

నేలకొండపల్లి: ప్రతీ పల్లె పచ్చటి మొక్కలు, చెట్లతో కళకళలాడాలని నేలకొండపల్లి ఎంపీడీఓ కె.జమలారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మంగాపురంతండాలో పల్లెప్రకృతి వనం, వైకుంఠ ధామం, క్రీడా ప్రాంగణాలు, రహదారుల వెంట నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనాలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎండ తీవ్రత పెరిగినందున్న ప్రతీ నర్సరీలో షేడ్‌నెట్‌ను ఏర్పాటు చేయాలని, క్రీడా ప్రాంగణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మొక్కల సంరక్షణను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.


మంగాపురంతండాలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి

ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సుధాకర్, పంచాయతీ కార్యదర్శి గోపిక, మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ఖమ్మంమయూరిసెంటర్/ నేలకొండపల్లి/ ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకుండా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడంతో పాటు విద్యారంగాన్ని విస్మరిస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు విమర్శించారు. ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఇటికాల రామకృష్ణ, నేలకొండపల్లిలో నున్నా రవికుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్య రంగానికి 6.57 శాతం నిధులు కేటాయించి పూర్తిగా మొండిచేయి చూపిందన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో దాదాపు 80 శాతం విడుదల కానివి అని చెప్పారు. నూతన జిల్లాలకు డీఈఓలు, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టుల కేటాయింపులు, గత ఆరు నెలలుగా ఉద్యోగుల బకాయిలు, జీపీఎఫ్, సప్లమెంటరీ బిల్లులు చెల్లింపుపై బడ్జెట్‌లో ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. విద్యార్థులు, యువతకు భవిష్యత్తు ఉండాలంటే విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. రాబోయే రోజుల్లో విద్యార్థులతో అభిప్రాయ సేకరణ చేసి ప్రభుత్వ విశ్వ విద్యాలయానికై పోరాట రూపకల్పన చేస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రజా ప్రతినిధులు, మేధావి వర్గం స్పందించి ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, సంఘ జిల్లా నాయకులు రాజారాం, చందూలాల్, నితిన్, అనిల్, వెంకటేష్, గోపి, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, మోహినుద్దీన్, సూరేపల్లి జ్ఞానరత్నం తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమయూరిసెంటర్: సమావేశంలో మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ


బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

బడ్జెట్ ప్రతులు దహనం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 6.57 శాతమే నిధులు కేటాయించడంపై పీడీఎస్‌యూ నాయకులు నిరసన తెలిపారు. ఈమేరకు సోమవారం ఖమ్మంలో బడ్జెట్ ప్రతులను దహనం చేయగా, జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్ మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అతి తక్కువగా నిధులు కేటాయించడమే కాక, జిల్లాకు యూనివర్సిటీ విషయాన్ని చేర్చకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్,లక్ష్మణ్, నగర కార్యదర్శి కరుణ్‌తో పాటు సాయి, అనిల్, గణేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలించి.. పరిష్కరించండి

గ్రీవెన్స్‌లో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి


ఫిర్యాదు స్వీకరిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రీవెన్స్, రెవెన్యూ మేళాలో ఫిర్యాదుదారులు అందించిన వినతిపత్రాలను పరిశీలించి, వారి సమస్యలను పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్, రెవెన్యూ మేళాలో 28 మంది నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆ ఫిర్యాదులను పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఎటువంటి ఫిర్యాదు అందిన వారం రోజుల్లోగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ జి.శ్రీనివాసరావు, ఆర్ఐలు కె.శ్రీనివాస్, పి.లోకేష్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

జోడోయాత్ర విజయవంతంపై ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఖమ్మంరూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన జోడోయాత్ర ప్రాముఖ్యతను తెలియచేస్తూ విడుదల చేసిన కరపత్రాలతో సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాయల నాగేశ్వరరావు కార్యకర్తలతో కలిసి మండలంలోని పెదతండాలో తిరుగుతూ జోడోయాత్ర హామీలను ప్రజలకు వివరించారు. తొలుత సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ఎరువులపై సబ్సిడీలను ఎత్తివేస్తోందని తెలిపారు. ఇక బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, కేజీ టూ పీజీ విద్యను అమలు చేయకుండా, పోడు భూములకు పట్టాలివ్వకుండా దగా చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు బైరు హరినాథబాబు, మొక్క శేఖర్‌గౌడ్, బత్తుల కూర్మారావు, మద్ది వీరారెడ్డి, చింతమళ్ల రవికుమార్, కందుకూరి వెంకటనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా సమ్మక్క, సారలమ్మ జాతర


వనదేవతల ఊరేగింపులో నృత్యం చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: మాగశుద్ధ పౌర్ణమి నాడు ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు మున్నేరు వంతెన పక్కన ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి దేవస్థానంలో కొలువుదీరిన సమక్క, సారలమ్మ జాతరను ఆది, సోమవారాల్లో వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఉప్పిసాయి ఆధ్వర్యాన మేడారం తరహాలో అమ్మవార్లకు వడిబియ్యం, పసుపు కుంకుమలను సమర్పించారు. ఈ సందర్భంగా వనదేవతలను నగరంలోని కాల్వొడ్డు, బొక్కలగడ్డ తదితర ప్రాంతాల్లో ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శివశక్తుల నృత్యాలు ఆకట్టుకోగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాటేటి అరుణ నాగేశ్వరరావు, కిరణ్, రవి, సైదులు, యాదగిరి, కుమారి, సుభద్ర, రాజమ్మ, ఝాన్సీ, లక్ష్మీకాంతమ్మ, సాయి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు..

ఖమ్మంరూరల్: మండలంలోని బారుగూడెంలో ఉన్న హజరత్ సయ్యద్ యాఖూబ్ షాహవలీ దర్గాలో నేటి నుంచి తొమ్మిదవ తేదీ వరకు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు మహ్మద్ నసీర్, షేక్. దావూద్‌లు తెలిపారు. సోమవారం దర్గాలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరెంపుల మతవల్లి ఇంటి నుంచి ఊరేగింపుగా గంధం బయలు దేరి 8న రాత్రి ఆరెంపుల, బారుగూడెంలలో కొనసాగి 9న సాయంత్రం దర్గాకు చేరుకుంటుందని చెప్పారు. ప్రతీ ఏడాది జరిగే ఈ ఉత్సవాలకు ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ నుంచి భక్తులు వస్తారని వారికి కావాల్సి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఖమ్మం బస్టాండ్ నుంచి దర్గా వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కల్పించినట్లు వెల్లడించారు. చివరి రోజు భక్తులకు మహా అన్నదానం నిర్వహిస్తున్న పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహమద్ ఖాజామియా, షేక్. యాఖూబ్‌మియా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. 200 మందికిపైగా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ మెంటం రామారావు తెలిపారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, గ్రేస్ సర్వీస్ సొసైటీ వారి సహకారంతో పరీక్షలు నిర్వహించిన ఈ శిబిరాన్ని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఎక్స్ రే, కేన్సర్ వ్యాధికి సంబంధించిన పలు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసిశారు. అనంతరం కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీటీసీ మాలోత్ లక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాతా వెంకటేశ్వరరావు, కేతినేని సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతాపం..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసిన మాజీ దడవాయి గణపరపు వీరయ్య (60) ఆదివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఉదయం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత వీరయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి సంతాపం తెలిపి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందిస్తున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. చైర్‌పర్సన్ వెంట స్థానిక కార్పొరేటర్ గట్టల లక్ష్మి తదితరులు ఉన్నారు.

సంత్‌గురు రవిదాస్‌కు బీజేపీ నివాళి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో సంత్‌గురు రవిదాస్ జయంతిని సోమవారం బీజేపీ దళిత మోర్చా ఆధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ పాల్గొని రవిదాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బీజేపీ దళితుల సంక్షేమ కోసం పాటుపడుతుందని తెలిపారు. అనంతరం పలువురి నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా నాయకులు సాంబయ్య, విజయరాజు, వెంకటనారాయణరెడ్డి, నాగేశ్వరావు, వీరస్వామి, కోటేశ్వరావు, కృష్ణ, జ్వాలా నర్సింహారావు, నకిరకంటి వీరభద్రం, సాంబశివరావు, మంద సరస్వతి, శేఖర్‌రెడ్డి, యోగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర వైఖరితో వ్యవసాయ రంగం కుదేలు


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర వైఖరితో వ్యవసాయ రంగం కుదేలైందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు కార్యక్రమాలు నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు అడపా రామకోటయ్య, రైతు సంఘం నాయకులు రాంకోటి, పుచ్చకాయల సుధాకర్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం..

కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి బైపాస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి ఏసు, కాటి వెంకటేశ్వరరావు, ఆయా సంఘాల నేతలు పోటు కళావతి, బాగం ప్రసాద్, పగిళ్ల వీరభద్రం, వీరబాబు, నంబూరి శంకర్రావు, కమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.